రెండేళ్లయినా పూర్తికాని నాలా, రోడ్డు నిర్మాణ పనులు


నాలా పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అమృత, బీజేపీ నాయకులు

నల్లకుంట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): శంకరమఠం కూరగాయల మార్కెట్ నుంచి బాగ్‌లింగంపల్లి, గాంధీనగర్, లంక ప్రాంతాల మీదుగా నిర్మిస్తున్న నాలా నిర్మాణ పనులు రెండేళ్ల నుంచి నత్తనడకన సాగుతున్నాయని కార్పొరేటర్ వై. అమృత ఆరోపించారు. నాలా నిర్మాణ పనులను సోమవారం ఆమె పరిశీలించారు. నాలా పనులు పూర్తికాకపోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. రోడ్డు పనులు కూడా రెండేళ్లయినా పూర్తి కాకపోవడం శోచనీయమన్నారు. రెండు నెలల్లోపు నాలా, రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఎం. మధుసూదన్ యాదవ్, నాయకులు దేవేందర్, మోహన్‌ప్రసాద్, సతీష్, రమణ, రమేష్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి రాజ్యాంగ హక్కుల రక్షణ సదస్సులు

రాంనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పూలే - అంబేడ్కర్ జన జాతర పేరిట రాజ్యాంగ హక్కుల రక్షణ సదస్సులు సామాజిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 14 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు నేతలు వెల్లడించారు. సోమవారం చిక్కడపల్లిలో కేవీపీఎస్ రాష్ట్ర కార్యాలయంలో సామాజిక సంఘాల రాష్ట్ర నాయకుల సమావేశం జి.రాములు అధ్యక్షతన జరిగింది. కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ, ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్‌బాబు, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరాంనాయక్, కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ, ఆవాజ్ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్, మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య, తెలంగాణ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర కార్యదర్శి భూపతి వెంకటేశ్వర్లు, తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఉపాధ్యక్షుడు తొడుసం భీమ్‌రావు తదితరులు మాట్లాడారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం రద్దుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు అభద్రతతో జీవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలన్నారు.

బస్తీల్లో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తాం

● కార్పొరేటర్ పావని


అరుంధతినగర్‌లో సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బస్తీల్లో సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావని అన్నారు. సోమవారం అరుంధతినగర్‌లో ఆమె పర్యటించి పెండింగ్‌లో ఉన్న షాబాద్ బండల ఏర్పాటు పనులను ప్రారంభించాలని జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్‌ను ఆదేశించారు. బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, ఓబీసీ మోర్చా అసెంబ్లీ కన్వీనర్ ఉమేష్, ఆకుల సురేందర్, ఆనంద్‌రావు, ప్రశాంత్, సతీష్, అరుంధతినగర్ బస్తీ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ సర్కిల్‌లో

రూ. 38.60 కోట్ల ఆస్తిపన్ను వసూలు

రాంనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ సర్కిల్ - 15లో 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ. 38.60 కోట్ల ఆస్తి పన్ను వసూలైందని సర్కిల్ అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ర తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు రూ. 40 కోట్ల టార్గెట్ ఉండగా 38.60 కోట్లు వసూలు చేశామన్నారు. బకాయిలపై 90శాతం వడ్డీ మాఫీ స్కీమ్‌తో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. ఆస్తిపన్ను చెల్లించని వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నేడు, రేపు బీజేపీ కో-ఆర్డినేటర్ల సమావేశాలు

ముషీరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో నిర్వహించాల్సిన ప్రణాళికలపై బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం, ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, ఆరు డివిజన్ల అధ్యక్షులు, సీనియర్ నాయకులతో సోమవారం అంతర్గత సమావేశం నిర్వహించారు. మంగళ, బుధవారం నియోజకవర్గంలో ఆరు డివిజన్లలో కో-ఆర్డినేటర్ల సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు.

ఈనెల 3వ తేదీన కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి జి. కిషన్‌రెడ్డి ముషీరాబాద్‌లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు. 6వ తేదీన బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వాడవాడలా పార్టీ జెండాల ఆవిష్కరణ, సేవా కార్యక్రమాలు చేయాలని నిర్ణయించారు. పోలింగ్ బూత్ కన్వీనర్‌లు టిఫిన్ బైఠక్ పేరుతో ప్రజలకు చేరువ కావాలని సూచించారు.

బకాయి వాటర్ బిల్లుల చెల్లింపునకు

వన్‌టైమ్ సెటిల్‌మెంట్‌కు అవకాశం

ముషీరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ రిజర్వాయర్ పరిధిలో మూడు సెక్షన్లలో పెండింగ్‌లో ఉన్న వాటర్ బిల్లుల చెల్లింపునకు వినియోగదారులకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కల్పిస్తున్నామని రిజర్వాయర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (డీజీఎం) మోహన్‌రాజ్ తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బకాయిల చెల్లింపునకు ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. 30వ తేదీలోపు బకాయిలు చెల్లించకపోతే పైపులైన్ కనెక్షన్ కట్ చేస్తామని హెచ్చరించారు. సకాలంలో బిల్లులు చెల్లిస్తే పెండింగ్ బిల్లులపై ఉన్న వడ్డీ, పెనాల్టీలను రద్దు చేస్తామని పేర్కొన్నారు.

ముషీరాబాద్ డీఐగా మహ్మద్ నదీమ్ హుస్సేన్



రాంనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా మహ్మద్ నదీమ్ హుస్సేన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డీఐగా పనిచేసిన వెంకటరెడ్డి ఇటీవల బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మహ్మద్ నదీమ్ హుస్సేన్ బదిలీపై వచ్చారు. 2009 బ్యాచ్‌కు చెందిన నదీమ్ సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో జీడిమెట్ల పీఎస్‌లో డీఐగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముషీరాబాద్ పీఎస్ పరిధిలో దొంగతనాల నివారణకు కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు చేపడతామన్నారు.

పవర్ బోరు వేసి ఎనిమిదేళ్లయినా..

● ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోని వైనం
● నీటి కోసం కవాడిగూడ మునిసిపల్ క్వార్టర్స్ వాసుల ఇబ్బంది

నేటికీ కరెంట్ కనెక్షన్ ఇవ్వలేదు


నీటి ట్యాంకులు, ఇన్‌సెట్‌లో కరెంట్ కనెక్షన్ లేని పవర్ బోరు

కవాడిగూడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ క్వార్టర్స్‌లో పవర్ బోరు వేసి ఎనిమిదేళ్లయినా నేటికీ కరెంట్ కనెక్షన్ ఇవ్వలేదు. ఈ విషయాన్ని స్థానికులు ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2016 సంవత్సరంలో అప్పటి డిప్యూటీ మేయర్ స్వర్గీయ గోల్కొండ రాజ్‌కుమార్ ఎమ్మెల్సీ ప్రభాకర్ ప్రత్యేక నిధులతో కవాడిగూడ మునిసిపల్ క్వార్టర్స్‌లో నీటి సమస్యను పరిష్కరించేందుకు పవర్ బోరు వేయించారు. అప్పటి హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ కె. లక్ష్మణ్, కార్పొరేటర్ స్వర్గీయ లాస్య నందిత బోర్‌ను ప్రారంభించారు. కరెంట్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో నీటికోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. బస్తీలో కమ్యూనిటీహాలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు అధికారులు, ప్రజా ప్రతినిధులకు సంవత్సరాల నుంచి వినతిపత్రాలు ఇచ్చినా నేటికీ సమస్యలు పరిష్కారం కాలేదని వాపోతున్నారు. పవర్ బోరుకు కరెంట్ కనెక్షన్ ఇవ్వాలని, కమ్యూనిటీ హాలు, వీధి దీపాల సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ప్రయోజనం లేదు



పవర్ బోరుకు కరెంట్ కనెక్షన్ ఇవ్వాలని అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ కె. లక్ష్మణ్, ప్రస్తుత ఎమ్మెల్యే ముఠా గోపాల్, అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదు. బస్తీవాసులు నీటి కోసం ఇబ్బంది పడుతున్నారు.

- పి. లక్ష్మణ్, మునిసిపల్ క్వార్టర్స్ బస్తీ కమిటీ అధ్యక్షుడు

సమస్య పరిష్కారానికి కృషి



పవర్ బోరుకు కరెంట్ కనెక్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటాను. కమ్యూనిటీహాల్ నిర్మాణం, వీధి దీపాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తాను.

- జి. రచనశ్రీ, కవాడిగూడ కార్పొరేటర్

అంబర్‌పేట బిడ్డను.. మరోసారి ఆదరించండి

బస్తీల్లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాదయాత్ర


కిషన్‌రెడ్డికి హారతి ఇస్తున్న మహిళ

బర్కత్‌పుర, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట బిడ్డను లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి ఆదరించాలని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి కోరారు. 2019 ఎన్నికల్లో అంబర్‌పేట నియోజకవర్గ ప్రజలు 50 వేల ఓట్ల మెజారిటీ అందించారని, మే 13న జరిగే ఎన్నికల్లో లక్ష మెజారిటీ అందించి తనను గెలిపించాలని ఆయన కోరారు. సోమవారం బర్కత్‌పుర రాఘవేంద్రస్వామి మఠంలో పూజలు నిర్వహించిన అనంతరం లింగంపల్లి చౌరస్తా, బాలప్పబాడ, కుర్మబస్తీ, వీరన్నగుట్ట తదితర బస్తీలలో పాదయాత్ర చేశారు. ఇంటింటికి వెళ్లి బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. మహిళలు ఆయనకు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు పక్కా భవనాలు, కమ్యూనిటీహాల్స్ నిర్మాణం, విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటు తన హయాంలోనే జరిగాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎన్.గౌతమ్‌రావు, ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, కోశాధికారి ఎ.సూర్యప్రకాష్ సింగ్, మహిళామోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు కె.గీతామూర్తి, నాయకులు కృష్ణకుమార్, సుభాష్‌పటేల్, క్షీరసాగర్, భీమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధిపై

కేటీఆర్ బహిరంగ చర్చకు రావాలి


మాట్లాడుతున్న గౌతమ్‌రావు

బర్కత్‌పుర, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధిపై మాజీ మంత్రి కేటీఆర్ బహిరంగ చర్చకు రావాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు సవాల్ విసిరారు. కిషన్‌రెడ్డి అభివృద్ధి చేయలేదని ఆయన విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా విమర్శలు చేస్తే అంబర్‌పేట ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సోమవారం బర్కత్‌పురలో విలేకరుల సమావేశంలో గౌతమ్‌రావు మాట్లాడారు. ప్రజలు బీఆర్‌ఎస్‌కు గుణపాఠం చెప్పినప్పటికీ కేటీఆర్ అహంకారంతో విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజం అని, గతంలో కేసీఆర్, కవిత కూడా ఓడిపోయారనే విషయాన్ని కేటీఆర్ మరచిపోయాడని విమర్శించారు. కిషన్‌రెడ్డిపై కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను బేషరతుగా ఉపసంహరించుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

'అంబర్‌పేటలో బలంగా బీఆర్‌ఎస్'

అంబర్‌పేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న టి. పద్మారావు గెలుపు ఖాయమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు అబ్దుల్ ఖాలేద్ అన్నారు. అంబర్‌పేటలో ఆయన సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీలను నామమాత్రంగా అమలు చేస్తూ ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. అంబర్‌పేటలో బీఆర్‌ఎస్ బలంగా ఉందన్నారు. పద్మారావును అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన కోరారు.

బీసీలను విస్మరిస్తున్న ప్రధాన పార్టీలు

● సగం ఎంపీ స్థానాలు కేటాయించాలి
● జాజుల శ్రీనివాస్‌గౌడ్


మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

కవాడిగూడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు సగం పార్లమెంట్ స్థానాలు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈనెల 7వ తేదీన నగరంలో బీసీ సంక్షేమ సంఘాల జాతీయ సదస్సు నిర్వహించి తమ నిర్ణయాన్ని ప్రకటిస్తామన్నారు.

సోమవారం దోమలగూడలో బీసీ భవన్‌లో జరిగిన బీసీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాన పార్టీలు బీసీలను విస్మరిస్తున్నాయని, అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు ఎనిమిది చొప్పున సీట్లు కేటాయించాల్సి ఉండగా బీజేపీ ఐదు, కాంగ్రెస్ మూడు, బీఆర్‌ఎస్ ఆరు స్థానాలు కేటాయించడం సరికాదన్నారు. ఓ పార్టీ కులం, మరో పార్టీ మతం, ఇంకో పార్టీ ప్రాంతం పేరుతో టికెట్లను కేటాయిస్తూ రాజకీయ దిగజారుడు తనానికి పాల్పడుతున్నాయని ఆయన ధ్వజమెత్తారు. కులం, ధనం ప్రాతిపదికన రాజకీయలు జరుగుతున్నాయని, వీటికి స్వస్తి పలికి బీసీ సామాజిక విధానాన్ని అమలు చేయాలని సూచించారు.

సమావేశంలో బీసీ కుల సంఘాల ఐక్యవేదిక చైర్మన్ కుందారం గణేషాచారి, బీసీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు మణి మంజరి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్, విద్యార్థి విభాగం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, బీసీ సంఘాల నేతలు జాజుల లింగంగౌడ్, గొడుగు మహేష్‌యాదవ్, సురేందర్, సమతాయాదవ్, ఇంద్రం మహేష్ మేరు, చారి తదితరులు పాల్గొన్నారు.

దోబీఘాట్‌లో షెడ్ల ఏర్పాటుకు కృషి


దోబీఘాట్‌ను సందర్శించిన దిడ్డి రాంబాబు తదితరులు

బర్కత్‌పుర, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): శివాజీనగర్ దోబీఘాట్‌లో షెడ్ల ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని మాజీ కార్పొరేటర్ దిడ్డి రాంబాబు హామీ ఇచ్చారు. సోమవారం నారాయణగూడ శివాజీనగర్ దోబీఘాట్‌ను సందర్శించి రజకుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షం నీరు వెళ్లడానికి పైప్‌లైన్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు రాజేష్‌లాల్, సభ్యులు మహేష్, రాజు, వినులాల్, గణేష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు భారతరత్న ప్రకటించాలి

● టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్


అంజన్‌కుమార్‌యాదవ్‌కు పింగళి వెంకయ్య చిత్రపటాన్ని అందజేస్తున్న జగదాంబ

రాంనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ పతాకం రూపకర్త పింగళి వెంకయ్యకు భారతరత్న అవార్డు ప్రకటించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కె.హెచ్.ఎస్.జగదాంబ ఆధ్వర్యంలో సోమవారం రాంనగర్ గుండులోగల ట్రస్ట్ కార్యాలయంలో జాతీయ పతాకం 103వ ఆవిర్భావ వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అంజన్‌కుమార్ యాదవ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. పింగళి వెంకయ్య చరిత్ర భావితరాలకు తెలిసే విధంగా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచి పాఠ్యాంశాల్లో పొందుపరచాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన గురించి పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రజలకు తెలియజేసేందుకు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పింగళి వెంకయ్య చిత్రపటాలు, జీవిత చరిత్ర బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కె.శ్యామలరావు, సభ్యులు శ్రీకాంత్, అనుదీప్, వెంకటేశ్వర్లు, అన్నపూర్ణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మిరియాల బాబూరావు, పొన్నాడ సుబ్రహ్మణ్యం, వరదరాజు, ఆనంద్, విజయ్ యాదవ్, జి.నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'కేసీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించండి'

ముషీరాబాద్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. సోమవారం భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్ ఎస్‌బీఐ కాలనీలో నాయకులతో కలిసి ఆయన పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులకు సూచించారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, బీసీసెల్ డివిజన్ అధ్యక్షుడు ఉమాకాంత్, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్‌అలీ, డివిజన్ మైనార్టీ కమిటీ అధ్యక్షుడు మగ్బుల్ తదితరులు పాల్గొన్నారు.

టీబీఎస్‌ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరిక

నల్లకుంట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి (టీబీఎస్‌ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు, సమితి నాయకులు దేవులపల్లి రంగారావు, ప్రసాద్ తదితరులు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నారు.

చలివేంద్రం ప్రారంభం

రాంనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చడం కోసం బీజేపీ ఓబీసీ మోర్చా సికింద్రాబాద్ జిల్లా నాయీ బ్రాహ్మణ విభాగం కో-కన్వీనర్ సంగం బాల్‌రాజ్ ఆధ్వర్యంలో రాంనగర్ గుండు చౌరస్తాలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీన్ని బీజేపీ సికింద్రాబాద్ జిల్లా పరిశ్రమల విభాగం కన్వీనర్ ఎస్. జగదీశ్వర్ సోమవారం ప్రారంభించారు.

న్యాయవ్యవస్థలో సమస్యలను పరిష్కరించాలి


లా చీఫ్ సెక్రటరీ తిరుపతికి వినతిపత్రం అందజేస్తున్న స్వామికుర్మ

రాంనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): న్యాయవ్యవస్థలో సమస్యలను పరిష్కరించాలని లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ సామాజిక చైతన్య సంస్థ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు నర్రి స్వామికుర్మ సచివాలయంలో లా చీఫ్ సెక్రటరీ తిరుపతిని కలిసి వినతిపత్రం అందజేశారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ.. పబ్లిక్ ప్రాసిక్యూటర్లుగా పనిచేస్తున్న వారు 15 ఏళ్ల నుంచి ఒకేచోట పనిచేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మూడేళ్లకొకసారి ఏపీపీలను ట్రాన్స్‌ఫర్ చేయాలన్నారు. జూనియర్ న్యాయవాదులకు రూ. 5వేల గౌరవ వేతనం చెల్లించాలని, స్టేట్ న్యాయ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకువస్తే న్యాయవాదులపై జరుగుతున్న దాడులను అరికట్టవచ్చన్నారు. నూతనంగా హైకోర్టు, జిల్లా కోర్టులలో నియమించే జీపీలు, ఏజీపీలు, స్టాండింగ్ కౌన్సిల్ మొదలైన పోస్టులలో సామాజిక న్యాయాన్ని పాటిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ న్యాయవాదులకు ప్రాతినిధ్యం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్‌యాదవ్, కార్యదర్శి సుదర్శన్, తెలంగాణ న్యాయవాదుల సమితి అధ్యక్షుడు పద్మారావు, బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఓంప్రకాష్‌యాదవ్ పాల్గొన్నారు.

డ్రైవర్‌ను ఢీకొట్టిన లారీ

మదీన, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొట్టడంతో మరో వాహనం డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. బహదూర్‌పురా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముషీరాబాద్‌కు చెందిన అబ్దుల్ జబ్బార్(50) లారీ డ్రైవర్. సోమవారం సాయంత్రం జూపార్కు ఎదుట రోడ్డుపై లారీని ఆపి టైర్లలో గాలి చెక్ చేస్తున్నాడు. అదే సమయంలో కేరళకు చెందిన లారీ (కేఎల్ 40టీ 9013 నంబర్) వేగంగా వస్తూ జబ్బార్‌ను ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. నిర్లక్ష్యంగా లారీ నడిపిన డ్రైవర్ అమర్‌దేవ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

సన్మానం


సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి టి. పద్మారావు గౌడ్‌ను సన్మానిస్తున్న అంబర్‌పేట నాయకులు పాక చందర్, జంగోని భాస్కర్‌గౌడ్, సునీల్ బిడ్లాన్, ఎ.జీవన్‌గౌడ్ తదితరులు - గోల్నాక, ఆంధ్రజ్యోతి


రంగారెడ్డి కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.కొండారెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.కృష్ణను సన్మానిస్తున్న తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి తదితరులు - కవాడిగూడ, ఆంధ్రజ్యోతి

ఇఫ్తార్ విందు


కాచిగూడలో జీవీఆర్ కరాటే అకాడమీలో సోమవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కరాటేలో శిక్షణ పొందిన ముస్లిం విద్యార్థులు, అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్.గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు. - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి